
# యమలోకంలో భూలోకం

-ఎనుగంటి వేణుగోపాల్



అది యమలోకం!....

సభలో కొలువుతీరి ఉన్నారంతా. కానీ యమధర్మరాజు రాలేదింకా. అందరూ ఆయన రాకకోసమే ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

దున్నపోతు వాసన వచ్చేసరికి లేవచ్చులే! అని 'కంప్యూటర్' మీద తలపెట్టి హాయిగా కునుకు తీస్తున్నాడు చిత్రగుప్తుడు. భూలోకంలో పాపాల గ్రాఫ్ పెరిగి పోతుండడంతో ఆ చిట్టా రాయడానికి లావాటి పుస్తకాలు సరిపోక వాటినెప్పుడో అటకెక్కించేసి లేటెస్ట్‌గా 'కంప్యూటర్స్' వాడుతున్నాడతను.

నరులంతా గుంపులు గుంపులుగా చేరి ముచ్చటించుకుంటున్నారు. వారి పాపఫలితాలు వెల్లడి కావల్సివుంది.

"ఏ.కె. 47 - రైఫిల్స్"తో యమకింకరులు వాళ్ళని కాపలా కాస్తున్నారు.

"అజంతా వాల్‌క్లాక్" 'ఠంగు'మని పదిగంటలు కొట్టింది.

దున్నపోతు నెక్కి యముడు ఠీవిగా సభలోకి ప్రవేశించాడు. యమలోకం భూలోకం వలె అంగుళమంగుళం అధునాతనంగా మారినా ఈ

యముడు అణుమాత్రం మారలేదు. అదే పౌరాణిక గెటప్. దున్నపోతే వాహనం. 'మారుతి'నో 'సాంత్రా'నో వాడమని చిత్రగుప్తుడు పోరుపెడితే, టాట్ వీల్లేదు పొమ్మన్నాడు యమధర్మరాజు.

ఆ విషయం పక్కన పెడితే - ప్రస్తుతం దున్నపోతుని అదిలించలేక అవస్తపడుతున్నాడు యముడు. భారీకాయం వలన ఆయాసంతో తెగ రొప్పుతున్నాడు.

అచ్చూసి పకపకా నవ్వాడొక పాపి, పొట్ట చెక్కలయ్యేలా.

ఆ పాపి నవ్వుకి జడుసుకుందో మరేంటో తెలీదు గానీ దున్నపోతు బెదిరిపోయి గొంతెత్తి అరిచింది. భయంతో శరీరాన్ని రైలుడబ్బాలా అటూ ఇటూ కదిపింది. కిందకి దిగే కష్టం లేకుండానే తూలి దబ్బున కిందపడ్డాడు. పాపం యముడు.

నడుము కలుక్కుమంది.

"యముండ!" అని ఓ అరుపు అరచి ఊర్కున్నాడు.

యముడి గావు కేకకి నిద్రాభంగమైన చి.గు. ఉలిక్కిపడి నిద్రలేచాడు. దెబ్బకు మైకం వదలి సభలో జరుగుతున్నదేమిటో అర్థం కాక గాబరాగా దిక్కులు చూశాడు. ఎదురుగా కిందపడ్డ యముడు కన్పించాడు.

"ఏమైందబ్బా ఈయనకు" అని ఆశ్చర్యపోతూ చి.గు. టక్కున నిలబడబోతే జీన్స్‌ప్యాంట్ సర్రున కిందకి జారింది.

ఆ ప్యాంట్‌ను ఎడంచేత్తో బొర్ర పైకి ఎగదోసుకుంటూ తెగ తంటాలు పడ్తూ, "గు... గుడ్ మార్నింగ్ సర్!" అని కుడి చేత్తో విష్ చేశాడు.

మళ్ళీ అంతలోనే ఇంగ్లీషూ గట్రా, పాశ్చాత్య భాషలు ఆయనగారికి సరిపడవని గుర్తుకు వచ్చి నాలిక్కరుచుకున్నాడు.

యముడు తనవైపు గుర్రుమని చూడకముందే చప్పున, "ప్రణామములు ప్రభూ!" అంటూ వినయం ఉట్టిపడేలా రెండు చేతులు జోడించి మరీ నమస్కరించాడు.

అదేమీ పట్టనట్టు ముక్కుతూ, మూల్గుతూ యమధర్మరాజు తన భారీకాయాన్ని తంటాలుపడుతూ భూమికి లంబంగా లేపి, శ్వాస ఎగపోస్తుంటే వెళ్ళి తన సీట్లో కూలబడ్డాడు.

ఇద్దరు యమభటులు పరుగుపరుగున వచ్చి, దున్నపోతుని తీస్కెళ్ళి కట్టేశారు. దాని ముందు కొన్ని బ్రెడ్‌పాకెట్స్ పడేసి చెవులకి 'వాక్‌మెన్' తగిలించేశారు. 'పాప్‌మ్యూజిక్' చెవినపడడంతో కామై పోయిందది.

చిత్రగుప్తుడు అందించిన "పెయిన్‌బామ్"ని నడుం పట్టిన చోట తనే నెమ్మదిగా రాసుకుంటూ, తన కర్ణకఠోర నవ్వుతో నరకవాసుల్ని భయకంపితుల్ని చేసిన నరునివైపు గుడ్లురిమి చూశాడు యముడు.

పైగా యమలోకం దద్దరిల్లేలా "డిజిటల్ సౌండ్"తో "యముండా!" అని గావు కేకేసి "ఎవరా వెధవన్నర వెధవ నన్ను చూసి నవ్వింది?" అంటూ ఎగిరెగిరి పడ్డాడు.

"తెలుసుకోండి చూద్దాం" అన్నాడా మానవుడు పళ్ళికిలిస్తూ.

"ఏం? పిచ్చి పిచ్చిగా ఉందా??" కయ్ మని లేచాడు చిత్రగుప్తుడు.

"వీళ్ళందరిలా జీన్సూ, టీషర్టూ తొడగక పోయేసరికి నా ఆకార విశేషాలు నీకంతగా నవ్వు పుట్టిస్తున్నాయా?" మండిపడ్డాడు యముడు.

"అలాంటిదేం కాద్సార్! స్వర్గాధిపతులకేమో 'పుష్పక విమాన' యానం. నరకాధీశులైన తమరికేమో దున్నపోతుతో యాతన. చిత్రగుప్తుల వారికేమో 'హీరోహోండా'తో ప్రయాణం. భలే బాగుంది. మా భూలోక వాసులవలె మీలోనూ ఎందుకీ తేడాల్సార్? పైగా మీరీ లోకానికి బాస్. మీ అమాయకత్వం చూస్తే జాలేస్తోంది. మీరింకా 'నాగయ్య', 'యస్వీరంగారావు'ల కాలంలో ఉన్నారు. మారిపోండి సార్! నేడంతా 'చిరంజీవి', 'నాగార్జున'ల బ్రాండ్ నడుస్తోంది." అని ఓ సెటైర్ విసిరి "అందుకుని నవ్వాను. అకారణమనిపిస్తే నన్ను మన్నించండి సార్!" అని వేడుకున్నాడు.

అది విని కిక్కురుమన్లేదు యముడు.

చిత్రగుప్తుని వైపు తిరిగి "చిత్రగుప్తా! నేడు నరకలోకానికి చేరిన నరుల పాపాలు చెప్పు" అని ఆదేశించాడు.

"ఓకే సార్!" అని కంప్యూటర్ ఆపరేట్ చేసి ఒక్కొక్కరి పాపాల్ని డీటెల్డ్‌గా ఏకరవు పెట్టసాగాడు. ఆయావ్యక్తులు భూలోకంలో చేసిన పాపపు పనులు వ్యక్తి వ్యక్తికీ విడివిడిగా, 'ఫ్లాపీ'లో భద్రపర్చబడి ఉన్నాయి.

"ఈ పాపి పేరు సత్యమూర్తి. పెదవి విప్పితే చాలు ఈయనగారి నోటినుండి రాలేవి అన్నీ అసత్యాలే! రాత్రికనే కలల్లోనూ ఎంచక్కా అతికినట్టు అబద్ధాలల్లేవాడు. కనుక ఈ పాపికి నాలుక మీద మేకులు కొట్టించాలి. చిత్రగుప్తుడు చెబుతోంటే చేతులు కట్టుకొని దీనంగా నిలబడ్డాడు సత్యమూర్తి అనబడే అసత్యమూర్తి.

"అతన్ని చూస్తే జాలేస్తోంది. నాలుక మీద మేకులు కొడితే పాపం భరిస్తాడో లేదో? శిక్ష కొద్దిగా తగ్గిద్దాం" అమాయకంగా మొహం పెట్టిన సత్యమూర్తి పైన సానుభూతి కురిపించాడు యముడు.

"మీకేం తెలీదు సార్! మీరూర్కోండి. వీడికా శిక్షపడాల్సిందే" కరాఖండిగా చెప్పేశాడు చిత్రగుప్తుడు.

"అయ్యయ్యో! అలా అంటావేంటి? పశ్చాత్తాపపడ్తున్నాడుగా!"

దోషుల తరపున యముడలా మాట్లాడ్డం కొత్తేంకాదు. అదే నచ్చదు చిత్రగుప్తునికి.

యముడిది జాలిగుండె. చాలా భోళా మనిషి. పాపులకు అంతంత పెద్ద శిక్షలు వద్దంటాడు. అదే చిక్కొచ్చిపడింది చిత్రగుప్తునికి.


"అయితే సలసలకాగే నూనెలో వేద్దాం" అన్నాడు చి.గు.

"అసత్యమాడాడు నిజమే! కానీ పరుల్ని పీడించలేదు కదా! ఏనుగులతో తొక్కిస్తే సరిపోతుంది" చెప్పాడు యముడు.

పెదవి విప్పలేదు చి.గు.

యమభటులు వచ్చి సత్యమూర్తిని రమ్మని ఏనుగుల గుంపు కిందికి తోసేశారు.

గజరాజుల్ని చూస్తూనే చిన్నపిల్లాడిలా చప్పట్లు



## చుక్కల్లో చంద్రుడు

'రోజా' చిత్రంతో ఎ.ఆర్. రెహమాన్ సంగీత దర్శకుడుగా పరిచయమైన ఈ 'దిలీప్' ఈరోజు సినీ సంగీత వినీలాకాశంలో, చుక్కల్లో చంద్రుడిలా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతితో రాజ్యమేలుతున్నాడు. విశేషమేంటంటే... ఒకప్పుడు కె.వి. మహాదేవన్ మంచి స్వింగ్‌లో ఉంటుండగా సరస్వతి స్టోర్స్... రికార్డింగ్ కంపెనీ నుంచి *1%* హెచ్.ఎమ్.వి. కంపెనీ నుంచి *2%* రాయల్టీ రాయించుకుంటే తెగ బాధపడిపోయేవారు నిర్మాత దర్శకులు.

ఈరోజు ఎ.ఆర్.రెహమాన్ బ్యాంక్ ఎగ్రిమెంటుల మీద సంతకాలు చేయించుకుంటున్నాడు.

అలాగే రెహమాన్ బ్యాంక్ చెక్కులు ఆఫర్ చేస్తున్నారు. ఈ వైభవం ఎవరికైనా దక్కేనా?



## టేలంటంటే?

రేవతి మొదట్నుంచీ మిగతా హీరోయిన్‌లకి భిన్నంగా ప్రవర్తిస్తుండేది. సెట్‌లో అందర్నీ ఆటపట్టించడంతో బాటు కెమెరా టెక్నికల్ వేల్యూస్‌ని పరిశీలించడం చేసేది. ఆ ఇంట్రస్టే ఈరోజు రేవతిని దర్శకురాల్ని చేసింది. మేకప్ చేసుకొని సెట్‌లో కూర్చొని తన పని తాను చేసుకుపోవడం పెద్ద గొప్పేం కాదు. కాని... కెమెరాతో కథ చెబుతూ.. యూనిట్ అందర్నీ సమన్వయపరచడం చాలా గొప్ప... అందులోనే నిజమైన టాలెంట్ బయటపడుతుంది, అంటుంది రేవతి...చూద్దాం. రేవతి మాటలవరకేనా? ఏవన్నా చేతల్లోనూ చూపిస్తుందా?

కొట్టాడు సత్యమూర్తి. యమకింకరులు విస్తుపోయారు. "వీడేంటీ? ఆటబొమ్మని చూసి గంతులేసే పిల్లాడిలా! ఆ ఏనుగులు చీమని నలిపినట్లు నలిపితే గాని వీడి రోగం కుదరద"ను కొన్నారు.

కాళ్ళ కిందపడిన సత్యమూర్తిని కసాపిసా తొక్కసాగాయి ఏనుగులు, గోల గోల చేస్తాడని ఆసక్తిగా చూస్తున్న భటుల ఆశ తీరనేలేదు. ఎందుకంటే సత్యమూర్తి కెవ్వుమని కేకవేయలేదు. యమలోకం అదిరేలా అరవలేదు. పిచ్చెక్కుతోంది వాళ్ళకి. తొక్కీ తొక్కీ గజరాజులే అలసిపోయాయి గానీ సత్యమూర్తికి చీమకుట్టినట్టయినా లేదు. అవి తొక్కుతోంటే 'డన్‌లప్' పరుపుమీద దొర్లినట్టు అటూ ఇటూ దొర్లుతున్నాడు.

"ఇదేమి నరుడి చోద్యమని" బుగ్గలు నొక్కుకుంటూ భటులు సత్యమూర్తిని యముని ముందు హాజరు పరిచి జరిగిందంతా చెప్పారు.

"ఆ..." అంటూ ఢామ్మని విరుచుకుపడి పోయాడు చి.గు. యముడేమో సీటు మీద శిలావిగ్రహంలా బిగుసుకుపోయాడు.

కాసేపటికి చి.గు. తేరుకొని ఉన్న 'ఫ్లాపీ'ని తొలగించి మరొక 'ఫ్లాపీ'ని కంప్యూటర్లో చేర్చి 'ఈ పాపి పేరు సావిత్రి".

యముడు పూర్తిగా వినకుండానే "అమ్మో! సావిత్రి ఏకంగా యమలోకానికే వచ్చిందా? కొంపదీసి సత్యవంతుడు మళ్ళీ చచ్చాడా?" అంటో కంగారుగా లేచి తుర్రుమని పారిపోబోయాడు.

"మిమ్మల్ని ముప్పతిప్పలు పెట్టి మూడు వరాలు పొందిన సావిత్రి కాద్సార్! ఆమె చచ్చి చాన్నాళ్ళయ్యింది. ఈమె ఈనాటి సావిత్రి. కలియుగ సావిత్రి." చిత్రగుప్తుడు సర్ది చెప్పేసరికి, తన పరుగుకి బ్రేక్‌వేసి, 'హమ్మయ్య' అని ఊపిరి గాఢంగా పీలుస్తూ సీట్లో కూలబడ్డాడు యముడు.

"ఈమె పేరుకి సావిత్రేగానీ అంత పతివ్రతేం కాదు. ఈమెగారికి వీధికో మొగుడున్నాడు. బ్రతికున్నన్నాళ్ళు భర్త కళ్ళు గప్పి రంకు సాగించింది. ఇలాంటి ఆడది స్త్రీ జాతికే అవమానం. ఎర్రగా కాల్చిన గునపాల్తో ఈవిడ శరీరాన్ని తూట్లు తూట్లు చేయించండి" కసిగా అన్నాడు చిత్రగుప్తుడు.

ఆ శిక్ష వినగానే దుఃఖం పొంగుకొచ్చింది సావిత్రికి. బేర్‌మంది. చివరికెలాగోలా గొంతు పెగుల్చుకొని "నే కావాలని తప్పుడు పన్చేయలేదు. నా భర్త అనారోగ్యానికి డబ్బవసరమై... గత్యంతరం లేక..." అంటూ నోట్లో కొంగు కుక్కుకుని మళ్ళీ బావురుమంది.

ఆమె ఏడ్పు చూసి యముడి గుండె చేరువైంది. తెలుగింటి ఆడపడుచుకంట లీటర్లకొద్దీ కన్నీటిని చూసి తట్టుకోలేకపోయాడు. ఆమెకి తోడుగా తనూ బొటబొటా కన్నీటి బొట్లు రాల్చాడు.

యముడి "ట్రాజెడీ" వాలకాన్ని చూసి కళ్ళకి పెట్టుకున్న 'రేబన్‌గ్లాసెస్' తీసేసి మరీ నుదురు కొట్టుకున్నాడు చి.గు.

"విన్నావుటయ్యా చిత్రగుప్తా.... పతికోసం సతిపాట్లు". అంటూ "ఏడవకమ్మా ఏడ్వకు. శిక్ష తగ్గిస్తా!" అని సావిత్రిని బుజ్జగించాడు. కాసేపలా యముడు బతిమిలాడాక ఏడుపాపేసిందా మహా ఇల్లాలు. ముక్కు చీదేసి కన్నీళ్ళు తుడిచేసుకుంది.

"ఈమెని చిన్న చిన్న గుండు సూదుల్తో నొప్పి కలుగకుండా గుచ్చండి చాలు" సుతిమెత్తని శిక్ష విధించాడు యముడు.

శిక్షవిని ముసిముసిగా నవ్వుకుంటున్న సావిత్రిని చూసి కట్టుడు పళ్ళూడి పోతాయేమోనన్న విషయం కూడా మరచి పళ్ళు పటపటలాడించాడు చి.గు.

మహిళా భటులు వచ్చి మగాళ్ళు లేని చోటికి సావిత్రిని తీస్కెళ్లారు. ఆమె శరీరం మీద ఇష్టం వచ్చినట్లు గుండు పిన్నుల్తో గుచ్చారు కసిదీరా. రవ్వంతైనా చలించలేదామె. పైగా పిన్నుల్తో గుచ్చుతోంటే చక్కిలిగింతలు పెట్టినట్టు కిలకిలా నవ్వుతూ మెలికలు తిరిగిపోసాగింది. బిత్తరపోయారా భటులు. వెళ్ళి యమునికి ఈ విషయం చెప్పారు.

అదివిని అందరూ ఎవరి ముక్కుమీద వాళ్ళు వేలేస్కున్నారు. భూలోక వాసుల చేష్టలు చూస్తోంటే యముడి నుండి మొదలుకొని యమకింకరుల వరకు అందరికీ అయోమయమన్పిస్తోంది. అయినా చేసేదేముంది?

బిక్కమొగం వేస్కొని మరో పాపి గురించి చెప్పసాగాడు చి.గు.

ఈ పాపి పేరు విద్యాసాగర్. పేరుకి తగనట్టు వీడికి ఒక్క ముక్కా వంటబట్టలేదు. పైగా సరస్వతికి ద్రోహం చేశాడు. ఎమ్‌సెట్, ఎస్సెస్సీ... ఒకటేమిటి అన్నిరకాల ప్రశ్నాపత్రాల లీకేజి కుంభకోణాల్లో సూత్రధారి. అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ పుస్తకాలు పేద విద్యార్థులకు అందకుండా చేసిన ఘనుడు. వీడికి తగిన శిక్షేమిటో, తమరే నిర్ణయించండి, ఏ శిక్ష విధించినా ఈ నరుల్నేం చేయలేనపుడు ఏదైతేనేం" అన్నట్లు చూశాడు.

"వీడు చదువుల తల్లికే తలవంపులు తెచ్చిన ద్రోహి! వీడినేమాత్రం వదలకూడదు. యముండ! ఈ పాపిని సలసల కాగే నూనెలో దోరదోరగా వేయించండి" ఆవేశంగా అరిచాడు యముడు.

యమ హుషారుగా యమభటుల వెంట కదిలాడు విద్యాసాగర్. వాళ్ళతన్ని "స్విమ్మింగ్‌పూల్" లాంటి ప్లేస్‌కి తీస్కెళ్లారు. నీళ్ళకి బదులు ఆయిల్ ఉందా 'పూల్'లో.... కాకపోతే సలసలా కాగుతోంది. ఆ ఆయిల్‌పూల్ ఎడ్జ్ దగ్గర విద్యాసాగర్ని నిల్చోబెట్టి ఎలక్ట్రికల్ స్విచ్ నొక్కారు. సర్రుమని అందులోకి జారాడతను.

అతగాడి హాహాకారాలు, గావుకేకలు చెవులారా విని ఆనందిద్దామని పళ్ళికిలించి ఆత్రుతగా ఎదురుచూడసాగారు భటులు. మరుగుతున్న నూనెలో ఓసారి మునకేసి పైకి తేలాడు విద్యాసాగర్. అతడి ముఖంలో బాధ తాలూకు ఫీలింగ్స్ లేవు.

"చమురాటలలో ఏమి హాయిలే యమా!" అంటూ ఉత్సాహంగా పాడుతూ ఈతకొట్టాడా నూనె కొలనులో.

మరుగుతున్న నూనెలో పడ్డాక అప్పడంలా అయిపోతాడనుకుంటే, ఆవగింజంతయినా అతనికి

చురుకు తగలకపోవడంతో జుట్టు పీక్కున్నారు యమభటులు. పిచ్చెక్కుతోంది వాళ్ళకి. చేసేదేం లేక కాసేపలా అతన్ని నూనెలో ఆడుకొనిచ్చి యముడి దగ్గరికెళ్ళారు. ఉన్నది ఉన్నట్లు జరిగింది జరిగినట్లు ఆయనకి వివరించారు.

అవాక్కయిపోయాడు యముడు. తల కొట్టేసినట్లయ్యిందతనికి. అది ఎ.సి. హాలయివప్పటికినీ విషయం విన్నాక ముచ్చెమటలు పోసాయి చిత్రగుప్తునికి.

“ఏమి ఈ చిత్రాతి చిత్ర విచిత్ర” మంటూ ఒకరి మొహాలొకరు చూస్కున్నారు. అక్కడున్న మిగతా పాపులు చంకలు గుద్దుకుంటూ సంబరంగా ఎగిరి గంతులేయసాగారు జాతర సీన్లోలా!

మరుగుతున్న నూనెలు పాపి శరీరాన్ని బొబ్బలెక్కించలేదు. ఏనుగుల్తో తొక్కించినా మరొక పాపి రవ్వంత కందిపోలేదు. పిన్నుల్తో గుచ్చితే మరొక పాపాత్మురాలికి కితకితలయ్యాయి. ఎందుకని? ఎలాంటి శిక్షలు వీళ్ళని చిత్రహింసలకి గురిచేస్తాయి?” తొలిసారి ఆలోచనల్లో పడిన యముడు ఆ రోజుకి సభ చాలించాడు.

* * *

చిత్రగుప్తుని చెవిలో గుసగుసలాడి యముడు దున్నపోతు నెక్కి హుటాహుటిన కైలాసానికి బయల్దేరాడు.

ఇంటర్నెట్ ఉండిగా అంతదూరమేం వెళ్తారని చిత్రగుప్తుడంటే ఆధునికత నచ్చని యముడు పరమేశ్వరుణ్ని స్వయంగా కలవడమే మర్యాద అన్నాడు.

నరకానికి ఒకే ఒక్క హాలిడే అయిన “వైకుంఠ ఏకాదశి” నాడు తప్ప వర్కింగ్ రోజున తన సభ వదలి బయటకురాని యముడు ఇలా అర్థాంతరంగా ఊడిపడడంతో ఆశ్చర్యపోయాడు శివుడు.

“ప్రభూ! నన్ను మీరే రక్షించాలి” రెండు చేతులూ జోడించాడు యముడు. బదులుగా తల పంకించాడా అర్ధనారీశ్వరుడు.

యముడు తన సమస్యను వివరించాక, “ఈ విషయంలో నేనశక్తుడను యమధర్మరాజా! భోళా శంకరుడను, నరులు వరాలడిగితే ఎగిరి గంతేసి ఇస్తాను తప్ప వాళ్లని హింసించే శాపాలు తెలపమంటే నావల్ల కాదు” అని తేల్చి చెప్పేశాడా నీలకంఠుడు.

నిరాశతో వెనుదిరిగిన యముడు ‘సత్యలోకం’ వైపు మళ్ళాడు. బ్రహ్మ ముందు తన బాధ వెళ్ళగక్కాడు.

అందుకు బ్రహ్మ, “నరలోకాధీశా! నేను సకల చరాచర సృష్టికర్తను. ప్రాణాల్ని సృష్టించడం వరకే నా బాధ్యత. అంతేకానీ బుద్ధి జీవుల మనోవికారాది చేష్టలన్నీ ఆ జగన్నాటక సూత్రధారి లీలా విన్యాసాల ప్రకారమే కదా జరిగేవి! శిక్షల్ని సృష్టించడం, వాళ్ళ చేష్టల్తో చేసిన పాపాల కనుగుణంగా దండించడం నీపని” అంటూ చేతులెత్తేశాడు.

చివరి ప్రయత్నంగా ‘వైకుంఠం’ వైపు దున్నపోతుని అదిలించాడు.

శ్రీ మహా విష్ణువుకి విష్ చేసి తన గోడుని విన్నవించుకున్నాడు.

“పాపులకి రకరకాల శిక్షలు వేయమని కదా ప్రభూ నన్నాజ్ఞాపించింది. కానీ నరకంలో నేను విధించే శిక్షలకి నరులు కించిత్ భీతిల్లడం లేదు. వాళ్ళకీ శిక్షలు నవ్వులాటగా ఉన్నాయి. పాపులకి కఠినాతి కఠినమైన శిక్షలు కావాలిపుడు. తమరే తరుణోపాయం సూచించి నన్నీ విషమ పరిస్థితి నుంచి గట్టెక్కించాలి” అంటూ వేడుకున్నాడు.

ఆ కమలనాభుడు నర్మగర్భంగా నవ్వుతూ-

“భూలోకానికిది కలియుగం, కలియుగంలో జరిగేవన్నీ చిత్రవిచిత్ర లీలా విశేషాలే! అలాంటి మానవులకిలాంటి శిక్షలు పనికిరావడం లేదంటే అది కలియుగ మహత్యమే! ఇందుకు పరిష్కారం నన్ను సూచించమనడం తమరికి భావ్యం కాదు. తమరి విధి నిర్వహణ, తమరి స్వఆలోచనల్తోనే పూర్తి కానివ్వండి.” అంటూ పరోక్షంగా యముడి చేతుల్ని అతడి మీదే పెట్టి తప్పించుకున్నాడు.

చేసేదేం లేక యముడు వెనుదిరిగాడు.

* * *

యమలోకానికి తిరిగి వచ్చాక కొందరితో ఓ కమిటీ ఏర్పాటు చేసి, వాళ్ళని భూలోకానికి పంపించాడు యముడు.

అతి తక్కువ కాలంలోనే ఆ కమిటీ ఓ భారీ రిపోర్ట్ తయారుచేసి యమునికి సమర్పించింది.

ఆ రిపోర్ట్ చూసి నివ్వెరపోయాడు యముడు.

“భూలోక వాసులకి టీవీలొచ్చాయి. వాటితోపాటు పుట్టగొడుగుల్లా బోల్డు ఛానల్స్. ఎంతకీ ఎడతెగకుండా, ముగింపు కార్డ్ పడకుండా, సాగీ సాగీ మెదళ్ళు మొదళ్ళు తినే డెయిలీ సీరియల్స్, వాటిని భరించలేక మానవులు రాయిలా తయారవుతున్నారు. అర్ధరాత్రనక, అపరాత్రనక సడెన్‌గా పెరిగిపోయే విద్యుత్‌చార్జీల షాక్‌కి తట్టుకుంటున్నారు. కాంతి కంటే వేగంగా పరుగులు తీసే రవాణాఛార్జీల్ని భరిస్తున్నారు. ఆకాశానికి చేరాలని ఆరాటపడుతున్న కనీసవస్తువుల ధరల్ని అందుకోలేక చిత్రవధలనుభవిస్తున్నారు. ఓట్లు వేసి గెలిపించుకున్న రాజకీయ నాయకుల మోసాల పోట్లకి జీవితం నుగ్గు నుగ్గయినా, ధీరోదాత్తంగా జీవనం కొనసాగిస్తున్నారు.

భూలోకంలోనే మానవులింత దారుణమైన మానసిక చిత్రహింసలకి గురవుతోంటే వీటిని మించిన శిక్షలు మరింకేం ఉంటాయి? వీటికి అలవాటుపడ్డ ఈ పాపుల్ని, మన లోకపు శిక్షలైన మరుగుతున్న నూనెలు, ఎర్రగా కాల్చిన గునపాలూ వగైరా వగైరాలు ఏవీ చేయలేవు. అస్సలు బాధించలేవు. అందుకని భూలోకంలోనే నరలోకాన్ని చవిచూస్తున్న ఈ కలియుగ మానవులకి ఆశిక్షలే సరైనవి.”


- ఇదీ ఆ నివేదిక సారాంశం.

ఆ రిపోర్ట్ ఆధారంగా చిత్రగుప్తునికి కొన్ని ఆజ్ఞలు జారీ చేశాడు యముడు.

అంతవరకు భూలోకానికి పరిమితమైన టీవీలు ఇపుడు యమలోకంలోను వెలిశాయి.

నరలోకంలో టీ.వీలు కనబడేసరికి అప్పటివరకూ యమ హుషారుగా ఉన్న పాపుల ముఖాలు దీపావళి టపాసుల్లా పేలిపోయాయి.

పాపులపై టీవీల ప్రయోగానంతరం విధించాల్సిన మరికొన్ని శిక్షలకి రూపకల్పన చేసుకోసాగాడు యముడు.



## ఫేషన్

*దివాకర్‌బాబు మాటల్లో సున్నితమైన హాస్యం గుండెల్ని పిండే డ్రామా ఉంటుంది. ఆత్రేయ మార్కు డైలాగ్స్ రాయడంలో సిద్ధహస్తుడనిపించుకున్నాడు. ఈమధ్య ఇతర భాషా రచయితలు కథలు అందించడమే కాకుండా డైలాగ్స్ కూడా రాసేస్తున్నారు. తెలుగులో సమర్థులైన రచయితలు లేకనా? అడిగాను. “అదో తమాషా లెండి. ఇంగ్లీషు సినిమా ఎంత చెత్తగా ఉన్నా ఎందుకు బావుందంటాం? అర్థం కాక. ఇదీ అంతే... అర్థంకాక భలే బావుంది అనడం. అడిగినంత సొమ్మిచ్చి ఒప్పుకోవడం ఈరోజు ఫేషనైపోయింది.” అన్నారు.*